క్లుప్తంగా

విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం



రేపల్లె: రేపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆప్తమిత్ర సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆంధ్రరత్న మునిసిపల్ హైస్కూల్‌లో నగదు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మునిసిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.తేజశ్వనికి సంస్థ తరఫున రూ.10,000, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రోత్సాహం రూ.10,000 కలిపి రూ.20 వేలు అందజేశారు. అదేవిధంగా మండలంలోని పది ప్రభుత్వ పాఠశాలల్లో తొలి స్థానంలో నిలిచిన 14 మంది విద్యార్థులకు ఆప్తమిత్ర సంస్థ రూ.5,000, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రోత్సాహం రూ.5,000 కలిపి రూ.10,000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాస్, పంతాని మురళి, గోగినేని పట్టాభిరామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, ఆప్తమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్



వేమూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా ద్రాక్షపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి అధికారిగా పని చేస్తూ బదిలీపై వేమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేసిన శ్రీమన్నారాయణ చీరాల బదిలీపై వెళ్లారు. గురువారం బాధ్యతలు చేపట్టిన పి.రవి కుమార్‌ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

రహదారి పనులకు శంకుస్థాపన



రేపల్లె: రేపల్లె మండలంలోని పలు గ్రామాల్లో రూ.3.6 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం గురువారం కూటమి నాయకులు నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో నాబార్డ్ నిధులు రూ.2 కోట్లతో రేపల్లె మండలంలోని బేతపూడి గ్రామం నుంచి రావి అనంతవరం, మోర్లవారిపాలెం, పేటేరు రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. రూ.1.5 కోట్లతో ఉప్పూడి గ్రామానికి వెళ్లే రహదారికి శంకుస్థాపన, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో అరవపల్లి గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



వేమూరు: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



తెనాలిటౌన్: స్థానిక పాండురంగ పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ పాల్గొని పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం వార్డులో అంగన్‌వాడీ పిలుస్తోందిరా ర్యాలీ నిర్వహించారు. పిల్లల తల్లులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకొర సేవలతో ఇబ్బందులు

- సామాజిక ఆరోగ్య కేంద్రంలో సక్రమంగా అందని వైద్య సేవలు
- సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- పనులు పూర్తి చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్న ప్రజలు



సామాజిక ఆరోగ్య కేంద్రం అసంతృప్తిగా నిలిచి పోయింది

వేమూరు: కూటమి ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాని(సీహెచ్‌సీ)కి నిధులు మంజూరు చేయకపోవడంతో మౌలిక వసతులు కల్పన అసంపూర్తిగా నిలిచిపోయింది. సీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తయినా సరియైన సౌకర్యాలు లేక అరకొరగా అందుతున్న వైద్య సేవలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీహెచ్‌సీ భవన నిర్మాణం గత ప్రభుత్వంలో పూర్తవగా అందులో కల్పించాల్సిన సౌకర్యాల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం పూర్తయినా సామాజిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సామాజిక ఆరోగ్య కేంద్ర భవనంలో మౌలిక వసతుల కల్పన అసంపూర్తిగా నిలిచిపోవడంతో మెరుగైన వైద్యం అందడం లేదని రోగులు అంటున్నారు.

- వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు వైద్య సేవలు కోసం ఇక్కడకు వస్తారు. వైద్య సిబ్బంది ఉన్నా ఆరోగ్య కేంద్రం భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోగులకు బెడ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో వైద్య రంగానికి పెద్దపీట

సామాజిక ఆరోగ్య కేంద్రానికి గత ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.8.60 కోట్లు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టింది. ఓపీ విభాగంలో వైద్యుల గదులు, రక్త పరీక్ష కేంద్రం, హెచ్ఐవీ రోగులకు గదుల ఏర్పాటు పూర్తి చేశారు. దీంతో వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపరేషన్ థియేటర్, రోగులకు బెడ్‌లు ఏర్పాటు చేసే గదులు నిర్మాణం నిలిచిపోయింది. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసింది. ఈ ప్రభుత్వం వైద్య రంగాని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరు చేసి మెరుగైన వైద్య సేవలు అందేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

సామాజిక ఆరోగ్య కేంద్ర భవనంలో వసతుల కల్పన అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిలిచిపోయిన పనులు చేపట్టాలి.



– తోడేటి సురేష్, చింతర్లంక, కొల్లూరు మండలం

ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేయాలి

కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేయాలి. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అసంతృప్తిగా ఉన్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిలిచిపోయిన పనులు పూర్తి చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలి.



– పోతర్లంక సురేష్, అమర్తలూరు మండలం

ఘనంగా 'అంగన్‌వాడీ పిలుస్తోంది'


సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న సీడీపీవో సుచిత్ర


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న కార్యకర్తలు తదితరులు

రేపల్లె: బాపట్ల జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రేపల్లె మున్సిపాలిటీలోని 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుచిత్ర మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికరమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 3 సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులకు నవచేతన పుస్తకాలపై అవగాహన కల్పించి, అంగన్‌వాడీ సేవల ప్రాధాన్యతను వివరించారు. మూడు సంవత్సరాలు వయస్సు కలిగిన పిల్లలు ఉన్న గృహాలను ప్రత్యేకంగా సందర్శించి, తల్లిదండ్రులను అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ప్రోత్సహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వాణి, పద్మావతి, శివపార్వతి, సహాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

చెరుకుపల్లి: మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం కాటూరు నాగేశ్వరరావు అన్నారు. పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చెరుకుపల్లి సెక్టార్‌లోని ఆరేపల్లి-1 సెంటర్‌లో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ బాగుంటేనే ఆయా గ్రామాల్లో పిల్లల భవిషత్ బాగుంటుందని, అంగన్‌వాడీ నుంచి ఎలిమెంటరీ పాఠశాలలో చేరిన పిల్లలు ఎంతో ప్రతిభావంతులుగా ఉంటారని ఆయన అన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి.ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అంగన్‌వాడీ సిబ్బందితో పాటు చిన్నారుల తల్లిదండ్రులు కృషి చెయ్యాలన్నారు. ఈ మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం జూన్ 6వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ధనలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో ఆరేపల్లి-1 అంగన్‌వాడీ కార్యకర్త భోగేశ్వరి, చెరుకుపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, బసవమ్మ, శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మహిళా పోలీస్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యతోనే బంగారు భవిష్యత్

ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం రాజమోహన్



మాట్లాడుతున్న ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం రాజమోహన్

బాపట్ల: పరిశోధనాత్మకమైన విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎం.సి.రాజమోహన్ పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో 33వ కళాశాల, హాస్టల్ డే కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం.సి.రాజమోహన్ మాట్లాడుతూ పరిశోధనాత్మకమైన వ్యవసాయ విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక సంప్రదాయ, వ్యవసాయ పంటలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వ్యవసాయ విద్యార్థులు చేసిన పరిశోధనలు రైతులకు అందే విధంగా కళాశాలలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ చాన్సులర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఎ.వి.రమణ, కరుణాసాగర్, ఎ.మణి తదితరులు ఉన్నారు.

'పని వద్దు.. బడి ముద్దు' ప్రదర్శన


పని వద్దు.. బడి ముద్దు ప్రదర్శనలో డీసీపీవో, సిఫార్డ్ సభ్యులు

బాపట్ల: పని వద్దు.. బడి ముద్దు అంటూ సిఫార్డ్ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన చేపట్టారు. డీసీపీవో పురుషోత్తమరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పురుషోత్తమరావు మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహించటం సంతోషకరమన్నారు. బాలలను పనికి కాకుండా చదువులవైపు మొగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఓఎస్ఐసీ కృష్ణ, సిఫార్డ్ కో ఆర్డినేటర్ బడుగు కిషోర్, ఎం.నాగరాజు, రాము, మున్సిపల్ హైస్కూల్ పీడీ కత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయడం జరిగిందని మండల విద్యాశాఖాధికారి కనపర్తి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆయన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణ రావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణ కుమారి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కొత్రా వారి వీధిలో భారీగా నిల్వ ఉంచిన ప్లాస్టిక్ సంచులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి వాటిని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నివారించేందుకు గుడ్డ సంచులను ఉపయోగించాలని సూచించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, నజీర్ ఉన్నారు.

నవ నాగ సహిత మానస దేవికి ప్రత్యేక పూజలు



బాపట్ల: శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో మూల నక్షత్రం గురువారం సందర్భంగా శత కలశాలతో జేష్ట అభిషేకోత్సవం శ్రీనవ నాగ సహిత మానస దేవికి అత్యంత వైభంగా జరిగింది. క్షేత్రపాలక దేవత హోమం చేపట్టారు. నవ నాగ సహిత మానస దేవికి అష్టోత్తర నామాలతో అభిషేక నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ బాబు నాగేంద్ర, మామిడి రాజశేఖర్, శ్యామలదేవి, కొత్రా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థలో పారిశుద్ధ్యం సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ ఆలీంబాషా తెలిపారు. గురువారం ఆయన నగరంలోని వివిధ వార్డులలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త ఎత్తకపోవడం లాంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

బడి బాట పట్టిన విద్యార్థులు


రామానగర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు


పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

బాపట్ల టౌన్: వేసవి సెలవులు ముగియడంతో చిన్నారులు బడిబాట పట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కావటంతో కొత్త బ్యాగ్‌లు, పుస్తకాలతో చిన్నారులు స్కూళ్లకు పయనమయ్యారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు పాఠశాలలకు వెళ్లారు. నిన్నటివరకు వెలవెలబోయిన పాఠశాలలు విద్యార్థుల రాకతో సందడిగా మారాయి. తొలిరోజు హాజరు అంతంత మాత్రంగానే నమోదయింది.

ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన కూటమి ప్రభుత్వం

సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపణ


సమావేశంలోమాట్లాడుతున్న బాబు ప్రసాద్

తెనాలిటౌన్: అధికారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసి అధికారం చేపట్టాక ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని కూటమి ప్రభుత్వంపై సీపీఐ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ నిప్పులు చెరిగారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఎం పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఇంటిపన్ను బాదుడు, అదానీ విద్యుత్ మీటర్లు బిగించి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వ ప్రజల విశ్వాన్ని కోల్పోవడమే కాకా వారి ఆగ్రహానికి గురైందని వెల్లడించారు. స్మార్ట్ మీటర్లు పగలకొట్టండి అని గతంలో చెప్పిన కూటమి నాయకులు నేడు గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం వాణిజ్య సంస్థలకు, నివాస గృహాలకు విద్యుత్ మీటర్లు బిగించి వెళ్లిపోతున్నారని మండిపడ్డారు. ఇంటి పన్నులు పెంచమని, కొత్త పన్నులు అమలు చేయమని వాగ్దానాలిచ్చి వాటిని నేరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహానికి మరింతగా కూటమి ప్రభుత్వం గురవుతుందని తెలియజేశారు. సమావేశంలో ఎస్.సుబ్రమణ్యం, మొవ్వా ఆదినారాయణ, ఆర్.ఆంజనేయులు, కె.రత్నప్రసాద్, కె.దుర్గా ప్రసాద్, కె.వెంకట రమణ, జి.ప్రసాద్, బి.బ్రహ్మారెడ్డి, ఎస్.రాజ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తెనాలిటౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరో ప్రతిష్టాత్మక సేవా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి తెలిపారు. గురువారం తెనాలి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీపాదం పేరిట సౌకర్యవంతమైన కృత్రిమ కాళ్ల ఉచిత పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ మంగళగిరి, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా చేపట్టిన సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రత్యేకమైన మోకీలు వ్యవస్థ కలిగిన 120 ప్రభ ఫుట్, కృత్రిమ కాళ్లను కోల్పోయిన దివ్యాంగులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కాళ్లను ఉపయోగించి నడవడం, మెట్లు ఎక్కడం, మడిచి కూర్చోవడం వంటి దైనందిన కార్యకలాపాలు సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. కాళ్లు లేని దివ్యాంగులు 72074 03150 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను జత చేసి ఈ ప్రభ ఫుట్ కృత్రిమ కాళ్లు ఉచితంగా పొందడం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 9 నుంచి 15 వరకు మంగళగిరి ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే శిబిరంలో కృత్రిమ కాళ్లు అందజేయబడతాయని చెప్పారు. రోటరీ గురువు వడ్లమాను రవి, పూర్వ గవర్నర్‌లు ప్రభాకర్, రమేష్, టి.రాజశేఖర్‌రెడ్డి, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ కె.మురళీమోహన్ రావు, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి రాజశేఖర్, నీరంజన్ గుప్తా ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



తెనాలిటౌన్: చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా దాని అభివృద్ధికి సహకరిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఎన్సీఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కరిముల్లా కొనియాడారు. స్థానిక మారీసుపేటలోని ఎన్సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో గురువారం 1979-80 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతిలో అధిక మార్కు లు సాధించిన విద్యార్థులకు సిల్వర్ మెడల్స్, ప్రశాంస పత్రాలు పంపిణీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పి.కరిముల్లా పాల్గొని స్కూల్ మొదటి, రెండోవ, మూడోవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పీఎస్ఎస్ ప్రసాద్, అహ్మద్ షరీఫ్, రమణబాబు, హనుమంతరావు, ఇజ్రా, వెంకటరెడ్డి, షేక్ కరిముల్లా, వాసు, రాజేశ్వరరావు, చలమయ్య, పోలేరమ్మ, షేక్ నూరుజాహాన్, శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

•చెత్త వలయంలో బాపట్ల


విజయలక్ష్మీపురంలో రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త నిల్వలు


డ్రైవర్స్ కాలనీలో వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారం

వీధులన్నీ శుభ్రంగా ఉండాలి... వీధుల్లో చెత్త, చెదారం నిల్వలు పేరుకుపోతే కఠిన చర్యలు తీసుకుంటాం అంటూ మున్సిపల్ అధికారులు తరచూ చెప్పే మాటలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పట్టణంలోని వీధుల్లో చెత్త, చెదారం నిల్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నా వాటిని తొలగించే వారు లేరు. దీనికి తోడు రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో చెత్త వర్షానికి తడిసి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. చెత్త చెదారం నిల్వలు పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తూ చెత్తను రోడ్డు పైకి చిమ్ముతున్నాయని డ్రైవర్స్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త నిల్వలను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు. - బాపట్ల టౌన్


ఇమ్మడిశెట్టివారిపాలెంలోని మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో చెత్త నిల్వలు